# విన్నవించిన వెంటనే పరిష్కారం

- ప్రచారంలో యాదవనగర్ వాసుల సమస్య విన్నపం
- తక్షణమే పరిష్కరించిన మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత



10వార్డు పిల్లలమర్రి యాదవనగర్ కాలనీలో కంప చెట్లతో మూసుకుపోయిన రహదారి



కంప చెట్లను తొలగించడంతో సుందరంగా మారిన యాదవనగర్ కాలనీ రహదారి

సూర్యాపేట రూరల్, నవంబర్ 5 : తమ దృష్టికి వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించడంతో పతికి తగ్గ సతి అనిపించుకున్నారు మంత్రి జగదీశ్ రెడ్డి సతీమణి సునీత. పట్టణంలోని పిల్లలమర్రి 10 వార్డు యాదవనగర్ కాలనీలో మంత్రి సతీమణి సునీత ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ సమయంలో కంప చెట్లు విపరీతంగా పెరిగి కాలనీలోని రహదారులు మూసుకుపోయి నడిచి వెళ్లలేకుండా ఉన్న దుస్థితిని సునీత కాలనీవాసులు సునీత దృష్టికి తీసుకువచ్చారు. కొంతకాలంగా స్థానిక కౌన్సిలర్ ప్రజలకు అందుబాటులో లేదు. దాంతో మంత్రి సతీమణి తక్షణమే స్పందించి జేసీబీని రప్పించి కంపచెట్లను తొలగించి రహదారిని సుందరంగా తీర్చిదిద్దారు. నిమిషాల్లోనే సుందరంగా మారిపోయిన రహదారిని చూసి మురిసిపోయిన యాదవ సోదరులు ఆనందం వ్యక్తం చేస్తూ బీఆర్ఎస్‌కు జై కొట్టారు.

# వ్యక్తులు వెళ్లినంత మాత్రాన పార్టీకి నష్టం లేదు

- బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు సవరాల సత్యనారాయణ



మాట్లాడుతున్న బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు సత్యనారాయణ

బొడ్రాయిబజార్, నవంబర్ 5 : బీఆర్ఎస్ ప్రజాదరణతో అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగిస్తున్న పార్టీ అని వ్యక్తులు వెళ్లినంత మాత్రాన పార్టీకి నష్టం లేదని, జిల్లా కేంద్రంలోని 45వ వార్డు ప్రజలంతా బీఆర్ఎస్ వైపే ఉన్నారని ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు సవరాల సత్యనారాయణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి, సంక్షేమంతో సూర్యాపేట జిల్లాను రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత బీఆర్ఎస్ పార్టీది, మంత్రి జగదీశ్‌రెడ్డిదని అన్నారు. జిల్లా కేంద్రంలో ఎవరూ ఊహించని విధంగా మెడికల్ కళాశాల, రెండు మినీ ట్యాంక్‌బండ్‌లు, ఐటీ హబ్, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణాలతో పట్టణ రూపు రేఖలు మారాయన్నారు. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే బీఆర్ఎస్ పార్టీకి వ్యక్తులు ముఖ్యం కాదని ప్రజలే ముఖ్యమని అలాంటి ప్రజలు బీఆర్ఎస్ వైపు ఉన్నారని, హ్యాట్రిక్‌తో తిరుగులేని విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో 45వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు కుక్కడపు సాలయ్య, మాజీ కౌన్సిలర్లు ఉప్పల సంపత్‌కుమార్, సయ్యద్ సలీం, నాయకులు నూకల వెంకటరెడ్డి, ముప్పారపు నాగేశ్వర్‌రావు, కుక్కడపు భిక్షం, వెంకటేశ్, దేవిరెడ్డి రవీందర్‌రెడ్డి, మిట్టపల్లి రమేశ్, నల్లపాటి రమేశ్, మంజుల, లతీఫ్ బాబా, పాపయ్యగౌడ్, రంగారావు పాల్గొన్నారు.

## మహాజన సభకు తరలిన విశ్వకర్మలు



హైదరాబాద్ తరలివెళ్తున్న విశ్వబ్రాహ్మణ విశ్వకర్మలు

బొడ్రాయిబజార్, నవంబర్ 5 : తెలంగాణ రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ మాతృసంఘం ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో నిర్వహించిన విశ్వకర్మ మహాజన సభకు జిల్లా అధ్యక్షుడు పోతుగంటి వీరాచారి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున విశ్వకర్మలు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో జిల్లా కార్యదర్శి కట్టోజు గోపి, జిల్లా మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ జనగామ వీరాచారి, మోతె మండలాధ్యక్షుడు సీతారామచారి, బెజ్జంకి ఉపేంద్రచారి, కట్టోజు కోటాచారి, పోలోజు మోహనాచారి, కడవెండి సతీశ్, కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బైరోజు లింగాచారి, ఉపేంద్రచారి, పర్వతం భూషణాచారి, మునిగడప వెంకటాచారి, కంచర్ల లింగాచారి ఉన్నారు.

# జిల్లాలో మరో 33 పోలింగ్ కేంద్రాలు

**నాలుగు నియోజక వర్గాల పరిధిలో ఓటర్లు 9,63,377 మంది**

**2018లో 1,168 పోలింగ్ కేంద్రాలు**

**ఈ సార్వత్రిక ఎన్నికల్లో 1,201 కేంద్రాల్లో పోలింగ్**




సూర్యాపేట, నవంబర్ 5 : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లాలో అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఓటు హక్కు వినియోగించుకునే పోలింగ్ కేంద్రాలను సైతం ఓటర్ల జాబితాకు అనుగుణంగా పెంచడం జరిగింది. 2018 ఎన్నికల సమయంలో 1,168 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఈ ఎన్నికల నాటికి మరో 33 పెంచి 1,201 కేంద్రాలను ఏర్పాటు చేశారు. సూర్యాపేట జిల్లాలో నాలుగు నియోజక వర్గాలు ఉన్నాయి. అందులో సూర్యాపేట, హుజూర్‌నగర్, కోదాడ నియోజక వర్గాలు సూర్యాపేట జిల్లాలో ఉండగా తుంగతుర్తి నియోజక వర్గంలోని ఆరు మండలాలు సూర్యాపేట, రెండు మండలాలు యాదాద్రి భువనగిరి, ఒక మండలం నల్లగొండ జిల్లా పరిధిలో ఉన్నది. నాలుగు నియోజక వర్గాల పరిధిలో మొత్తం 26 మండలాలు ఉన్నాయి. వాటి పరిధిలో సుమారు 9,63,377 మంది ఓటర్లు ఉన్నారు. వారందరికీ ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సుమారు 1,100 మందికంటే తక్కువగా ఉండే విధంగా పోలింగ్ కేంద్రాల ప్రక్షాళన చేయడం జరిగింది. గతంలో ఒక్కో పోలింగ్ కేంద్రంలో దాదాపు 1,200 నుంచి 1,450 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేవారు. అయితే ఆ సంఖ్యను తగ్గించాలని భావించిన ఎన్నికల సంఘం 900 నుంచి 1,100 మందికి ఒక పోలింగ్ కేంద్రం ఉండేలా ఏర్పాట్లు చేసింది. గతంలో ఒక గ్రామం ఓట్లు మరో గ్రామంలో ఉండేవి. వారు ఓటు వేయడానికి వ్యయప్రయాసాలు ఎదుర్కొనేవారు. అయితే ఈసారి మెరుగైన వసతుల కల్పనతో ఓటింగ్ శాతం సైతం పెరుగుతున్నదని అంచనా వేస్తున్నారు.

## పోలింగ్ కేంద్రాల్లో మౌళిక వసతుల కల్పన

ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌళిక వసతుల లేక ఓటర్లు ఇబ్బందులు పడేవారు. కనీసం తాగునీరు కూడా ఉండేది కాదు. ఓటు వేసే వరకు ఎండలోనే నిలబడాల్సిన పరిస్థితి. వాటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఈసారి ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లా అధికారులతో కలిసి మౌళిక వసతుల కోసం ప్రత్యేకంగా కమిటీ వేయడం జరిగింది. నాలుగు నియోజక వర్గాలకు నోడల్ ఆఫీసర్లను నియమించి స్థానిక ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులను సభ్యులుగా నియమించారు. వారు మండలంలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌళిక వసతులు ఎలా ఉన్నాయో అధ్యయనం చేసి చర్యలు చేపట్టనున్నారు. పోలింగ్ కేంద్రంలో వృద్ధులు, దివ్యాంగులకు వీలుగా ర్యాంప్‌ల ఏర్పాటు, ట్రై సైకిళ్లను అందుబాటులో ఉంచుతుంది. విద్యుత్, మంచినీటి సౌకర్యం, ఎండ తగులకుండా టెంట్లు ఏర్పాటు ఇలా అన్ని వసతులు కల్పించనున్నారు. అనారోగ్యం గురైతే వైద్య సిబ్బంది సైతం అందుబాటులో ఉండనున్నారు.

## మండలాల వారీగా పోలింగ్ కేంద్రాలు..

జిల్లాలోని 23 మండలాలతో పాటు తుంగతుర్తి నియోజక వర్గంలోని అడ్డగూడూరు, మోత్కూరు, శాలిగౌరారం మండలాలు ఉన్నాయి. నాలుగు నియోజక వర్గాల పరిధిలో 1,201 పోలింగ్ కేంద్రాలు ఉండగా హుజూర్‌నగర్ నియోజక వర్గంలోని గరిడేపల్లిలో 57, హుజూర్‌నగర్–58, మఠంపల్లి–45, నేరేడుచర్ల–43, పాలకవీడు–27, మేళ్లచెర్వు–42, చింతలపాలెం–36 ఉన్నాయి. కోదాడ నియోజక వర్గ పరిధిలో చిలుకూరులో–38, మునగాల–44, కోదాడరూరల్, పట్టణం– 104, నడిగూడెం–29 అనంతగిరి–33, మోతే–48 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. సూర్యాపేట నియోజక వర్గంలో ఆత్మకూర్(ఎస్)లో 51, చివ్వెంల–47, పెన్‌పహాడ్–40, సూర్యాపేట రూరల్–47, సూర్యాపేట టౌన్‌లో 86 పోలింగ్ కేంద్రాలున్నాయి. తుంగతుర్తి నియోజక వర్గ పరిధిలో అర్వపల్లిలో 32, నాగారం–29, నూతనకల్–35, మద్దిరాల–31, తుంగతుర్తి–46, తిరుమలగిరి–40, శాలిగౌరారం–52, మోత్కూరు–31, అడ్డగూడూరులో 30 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

**జిల్లాలో నియోజక వర్గాల వారీగా కొత్త.. పాత పోలింగ్ కేంద్రాల వివరాలు**

| నియోజక వర్గం | పాతవి | కొత్తవి | పెరిగినవి |
|---|---|---|---|
| హుజూర్‌నగర్ | 302 | 308 | 06 |
| కోదాడ | 286 | 296 | 10 |
| సూర్యాపేట | 264 | 271 | 07 |
| తుంగతుర్తి | 316 | 326 | 10 |
| | 1,168 | 1,201 | 33 |

# బీఆర్ఎస్ పాలనలో సూర్యాపేట ప్రగతి బాట

- మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత



పిల్లలమర్రిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత

సూర్యాపేట రూరల్, నవంబర్ 5 : తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు గ్రామాలు ఎలా ఉన్నాయో, ఎలాంటి బాధలు పడ్డామో అందరికీ తెలుసని.. రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్ఎస్ పాలనలో సూర్యాపేట ప్రగతి బాటన పయనిస్తున్నదని మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి గుంటకండ్ల సునీత అన్నారు. ఆదివారం ఉదయం సూర్యాపేటలోని 10, 12, 34వ వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కారు గుర్తుకు ఓటేసి మంత్రి జగదీశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి సూర్యాపేట అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. మిషన్ భగీరథ నీటితో గ్రామాల్లో నీటి గోస తీర్చిన గులాబీ పార్టీని గుండెల్లో పెట్టుకుని కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. అంతకుముందు పిల్లలమర్రి శివాలయాల్లో మంత్రి సతీమణి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బచ్చలకూరి శ్రీను, బీఆర్ఎస్ నాయకులు బంగారి శ్రీను, రాపర్తి సైదులుగౌడ్, రాపర్తి శంకర్, రాపర్తి మహేశ్, చెర్కుపల్లి ఉపేందర్, జలీల్, పూర్ణయ్య, నరేశ్, సత్యవతి, అండాలు, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం

నూతనకల్, నవంబర్ 5 : మండల కేంద్రానికి చెందిన జులూరి సతీశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. తనతో పాటు నూతనకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–2001 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం సతీశ్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.40,500 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సాగర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సురేశ్, ఆగమల్లు శ్రీధర్, సంతోశ్, చిరంజీవి పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి

అర్వపల్లి, నవంబర్ 5 : జాజిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త బొడ్డుపల్లి బాలస్వామి తండ్రి ఉప్పలయ్య వ్యవసాయ పనులపై ట్రాక్టర్ తీసుకుని వెళ్తుండగా ట్రాక్టర్ తిరుగబడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వైద్య చికిత్స కోసం బీఆర్ఎస్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మొరిశెట్టి ఉపేందర్, సర్పంచ్ కుంభం ఉషారాణి, గ్రామ శాఖ అధ్యక్షుడు పొన్న హరిప్రసాద్, కార్యదర్శి కోటమర్తి మల్లయ్య, లొడంగి నాగరాజు, నర్సింగ సందీప్, కుంభం మహేశ్, గండమల్ల ఎల్లయ్య, యాకయ్య, వార్డు సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.